తెలంగాణ ప్రజావారధి

ప్రతి అడుగు నిజం వైపు

www.telanganaprajavaradhi.com

తెలుగు దినపత్రిక



హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక : 01 | శనివారం | 21 - 11 - 2026 | ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి | పేజిలు : 2



మేమింతే..

తీరుమారని గుండాల తహసీల్దార్ ఆఫీస్

బ్యాంక్ తాకట్టులో ఉన్న భూమి రిజిస్ట్రేషన్

- ఎవరికి లేని బాధ మీకెందుకంటూ దురుసు సమాధానం
- భూభారతి పోర్టల్‌లో లొసుగులను క్యాష్ చేసుకుంటున్న వైనం
- భూభారతి ఆపరేటర్, డాక్యుమెంట్ రైటర్లతో వ్యవహారం
- బ్యాంక్ తాకట్టులో ఉన్న భూములను రిజిస్ట్రేషన్లు చేయొద్దంటున్న మేనేజర్లు
- అక్రమ రిజిస్ట్రేషన్లకు గుండాల తహసీల్దార్ ఆఫీస్ అడ్డాగా మారిందన్న ఆరోపణలు



ప్రజావారధి/గుండాల

గుండాల తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న అక్రమాలపై జిల్లా అధికారులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా అక్కడ పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది తీరు మాత్రం మారడం లేదు. మేమింతే అన్నట్టుగా అధికారులు, సిబ్బంది వ్యవహారం ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవలే తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన భూ అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో తహసీల్దార్‌కు షోకాజ్ నోటీస్ ఇవ్వగా, కీలకంగా వ్యవహరించిన సీనియర్ అసిస్టెంట్ సస్పెండ్ అయ్యారు. గతంలో ఇదే మాదిరిగా జరిగిన అక్రమాలపై జిల్లా అధికారులు ఒకరిద్దరు తహసీల్దార్లను బదిలీపై పంపించేశారు. అయినా ఎవరెన్ని చర్యలు తీసుకున్నా మేం చేసేది చేస్తామన్నట్టుగా అధికారుల తీరు ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా గుండాల తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఘటన ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది.

బ్యాంక్ తాకట్టులో ఉన్న భూమి రిజిస్ట్రేషన్

బ్యాంక్ తాకట్టులో ఉన్న భూమిని గుండాల తహసీల్దార్ ఇటీవల రిజిస్ట్రేషన్ చేసినట్టు తెలిసింది. బ్యాంక్‌లో భూమి తాకట్టు పెట్టి రుణం తీసుకోగా ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయడానికి అవకాశం లేకున్నా సేల్ డీడ్ కింద రిజిస్ట్రేషన్ చేసినట్టు సమాచారం. బ్యాంక్ మేనేజర్లు అలాంటి భూములను రిజిస్ట్రేషన్ చేయొద్దని చెప్తున్నా భూభారతిలో ఉన్న లొసుగులను ఆసరా చేసుకుని రిజిస్ట్రేషన్ చేస్తున్నారంటున్నారు. గుండాల మండలంలోని ఓ గ్రామానికి చెందిన రైతు తన భూమిని గుండాల రైతు సేవా సహకార సంఘం, నాగార్జున గ్రామీణ బ్యాంక్ మోత్కూరు బ్రాంచ్‌లో తాకట్టు పెట్టి సుమారు రూ.7 లక్షల రుణం తీసుకున్నట్టు సమాచారం. ఆ రుణం అలా ఉండగానే, భూమి ఒరిజినల్ పాస్ బుక్ బ్యాంక్‌లో ఉన్నా ఇటీవల ఆ రైతు తనకున్న భూమిలో కొంత భూమిని ఓ వ్యక్తికి అమ్మాడు. ఈనెల 12న గుండాల తహసీల్దార్ కార్యాలయంలో ఆ భూమిని తహసీల్దార్, భూభారతి ఆపరేటర్ సేల్ డీడ్ కింద రిజిస్ట్రేషన్ చేశారు. రుణం తీసుకుని భూమి బ్యాంక్ తాకట్టులో ఉంటే స్లాట్ బుక్ చేసే సమయంలో, భూభారతి ఆపరేటర్ చెక్ చేసే సమయంలో ఏ బ్యాంక్‌లో రుణం ఉందో పాప్ అప్ కనిపిస్తుందని, అలాంటి వాటికి స్లాట్ బుక్ చేయడం గాని, రిజిస్ట్రేషన్ చేయడం గాని చేయొద్దు. కానీ అవన్నీ కనిపించినా లెక్క చేయకుండా ఇటు భూభారతి ఆపరేటర్, అటు తహసీల్దార్ పత్రాలన్నీ తయారు చేసి సేల్ డీడ్ కింద రిజిస్ట్రేషన్ చేసేశారు. బ్యాంక్ రుణం ఉన్నట్టు పాపప్ కనిపించినా స్లాట్ బుక్ కాకుండా, రిజిస్ట్రేషన్ కాకుండా భూభారతిలో లాక్ ఆప్షన్ పెట్టకపోవడంతో దాన్ని ఆసరాగా చేసుకుని క్యాష్ చేసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఇలాంటి రిజిస్ట్రేషన్లలో భూభారతి ఆపరేటర్ కూడా కీలక పాత్ర పోషిస్తున్నాడన్న ఆరోపణలు ఉన్నాయి.

ఎవరికి లేని బాధ మీకెందుకంటూ..

బ్యాంక్ తాకట్టులో ఉన్న భూమిని సేల్ డీడ్ కింద రిజిస్ట్రేషన్ చేసిన వ్యవహారంపై తహసీల్దార్‌ను అడిగితే అమ్ముకున్న రైతుకు, కొన్న వ్యక్తికి లేని బాధ మీకెందుకంటూ దురుసుగా సమాధానం చెబుతున్నారు. భూమిని బ్యాంక్‌లో తాకట్టు పెట్టి రుణం తీసుకుంటే ఒరిజినల్ పాస్ బుక్ బ్యాంక్‌లో ఉంటుందని, బ్యాంక్ ఎన్‌వోసీ, అసలు పట్టా పాస్ బుక్ లేకుండా, ఈసీలో చూపిస్తున్నా రిజిస్ట్రేషన్ ఎలా చేశారన్నది తెలియడం లేదు. గుండాల మండలం నూనెగూడెం గ్రామంలో ఇటీవల జరిగిన భూ అక్రమ రిజిస్ట్రేషన్‌లో కూడా ప్రస్తుత తహసీల్దార్ ఇదే విధంగా రిజిస్ట్రేషన్ చేశారు. ఆ విషయం కాస్తా వెలుగులోకి రావడంతో జిల్లా అధికారులు వెంటనే అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేశారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు వ్యవసాయ భూమిని గుంటల లెక్కన నాలా కిందకు మార్చేందుకు కూడా ఎడాపెడా అనుమతులిస్తున్నట్టు తెలుస్తోంది.

పాస్‌బుక్, ఎన్‌వోసీ ఉంటేనే రిజిస్ట్రేసన్ చేస్తాం

-హరికృష్ణ, తహసీల్దార్, గుండాల



పట్టాదారు పాస్ బుక్ ఉంటేనే రిజిస్ట్రేషన్ చేస్తాం. ఒకవేళ బ్యాంక్ రుణం ఉంటే ఎన్‌వోసీ ఉండాలి. ఆ భూమిని నేనే రిజిస్ట్రేషన్ చేశా. బ్యాంకుల్లో తాకట్టు పెట్టి రుణం తీసుకున్న భూములకు సంబంధించి పాపప్ కనిపిస్తుంది. అలాంటి వాటిని బ్యాంక్ మేనేజర్లు రిజిస్ట్రేషన్ చేయవద్దని చెప్పారు. అన్నీ డాక్యుమెంట్లు పరిశీలించిన తర్వాతే ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేశాం.

పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే సామేల్





- ఆరుతడి పంటలతోనే రైతులకు మేలు
- శాలిగౌరారంలో ఎల్‌నినోపై అవగాహన సదస్సు
- పాల్గొన్న కలెక్టర్ చంద్రశేఖర్, అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజావార్ధి/శాలిగౌరారం

పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ప్రజలకు మంచి చేయాలన్న చిత్తశుద్ధి ప్రజా ప్రభుత్వానికి ఉందని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శాలిగౌరారం మండల కేంద్రంలోని జీబీఎం ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఎల్‌నినోపై నిర్వహించిన అవగాహన సదస్సుకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం చేయూత పెన్షన్ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను, సీఎంఆర్ఎఫ్, షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులను ఎంపీ, ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ కలిసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజలు ప్రతి నీటి బొట్టును కాపాడుకోవాలన్నారు. వీబీజీ రాంజీ కింద ఎక్కువ పనులు చేపట్టాలని, ముఖ్యంగా వాన నీటి సంరక్షణ పనులు, ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. రైతులు పంట మార్పిడి కింద ఆరుతడి పంటలు వేసుకోవాలని, వరి పంటకు ఎక్కువ నీరు అవసరమవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. సీఎం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించారని, చిత్తశుద్ధితో చేయూత పింఛన్లు పంపిణీ చేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వం ప్రజలకు ఎలాంటి లబ్ధి చేకూర్చలేదని విమర్శించారు. ప్రజల సమస్యలను దశలవారీగా పరిష్కరించి ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని చెప్పారు.



నీటిని వృథా చేయవద్దు : కలెక్టర్

జిల్లా కలెక్టర్ బడుగుల చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎల్‌నినో నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని కాపాడుకోవాలని, వృథా చేయవద్దని పిలుపునిచ్చారు. రైతులు తక్కువ నీరు అవసరమయ్యే ఆరుతడి పంటలు సాగు చేయాలన్నారు. శాలిగౌరారం మండలానికి చేయూత పెన్షన్లలో భాగంగా నూతనంగా 1,016 పింఛన్లు మంజూరు చేశామని, అవి నవంబర్ 26 నుంచి లబ్ధిదారుల ఖాతాల్లో జమవుతాయని తెలిపారు. ఇందిరమ్మ జీవిత బీమా పథకం కింద కుటుంబంలో సంపాదించే వ్యక్తి మరణిస్తే రూ.5 లక్షల జీవిత బీమా ప్రభుత్వం అందిస్తుందని, జిల్లాలోని అన్ని కుటుంబాలకు ఈ పథకానికి అర్హత ఉందని చెప్పారు.
ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇంచార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, ఆర్డీవో యారాల అశోక్ రెడ్డి, డీఆర్డీఓ పీడీ శేఖర్ రెడ్డి, అడిషనల్ పీడీ గంజి హరీష్ కుమార్, మార్కెట్ చైర్మన్ పాదూరి శంకర్ రెడ్డి, వైస్ చైర్మన్ నరిగె నర్సింహా, మండల అధ్యక్షుడు చింత ధనంజయ్, తహసీల్దార్ కేతావత్ మాధవరావు, ఎంపీడీవో భువనగిరి రమేష్, సర్పంచులు వంగూరి కవితవెంకన్న, శేఖర్ బాబు, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు తోటకూరి పరశురామ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు అన్నెబోయిన సుధాకర్, కందాల సమరం రెడ్డి, జిల్లా, మండల స్థాయి అధికారులు, అన్ని గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సమాచార శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సంస్కృతిక సారధి కళాకారులు ఎల్‌నినో ప్రభావం, తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై ప్రజలకు తమ కళా ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. సదస్సుకు హాజరైన వారితో నీటిని సంరక్షిస్తామని నకిరేకల్ క్లస్టర్ ఏపిడి గార్లపాటి జ్యోతిలక్ష్మి ప్రతిజ్ఞ చేయించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజావార్ధి/శాలిగౌరారం

లయన్స్ క్లబ్ ఆఫ్ శాలిగౌరారం ఆధ్వర్యంలో తాటికల్ వృద్ధాశ్రమంలో అన్నదానం, పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. చౌగోని అజయ్ - రేణుక దంపతులు తమ కుమారుడు పవన్ పుట్టినరోజు సందర్భంగా, అలాగే నూతన గృహ ప్రవేశం చేసిన శుభ సందర్భాన్ని పురస్కరించుకుని వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేసి, పండ్లు పంపిణీ చేశారు. కుటుంబంలో శుభకార్యాలను సేవా కార్యక్రమాల ద్వారా జరుపుకోవడం అభినందనీయమని, ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో మానవత్వం, సేవాభావం, పరోపకారాన్ని పెంపొందిస్తాయని క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ వృద్ధాశ్రయ చైర్మన్ ఎన్. రామ్మోహన్ రావు , జోన్ చైర్మన్ డెంకల సత్యనారాయణ, శాలిగౌరారం క్లబ్ అధ్యక్షుడు నిమ్మల ఆంజనేయులు, కార్యదర్శి కప్పల శ్రీకాంత్, వనజ పాల్గొన్నారు.



శాలిగౌరారం ఎంపీడీవోగా రమేష్



ప్రజావార్ధి/శాలిగౌరారం

శాలిగౌరారం ఎంపీడీవోగా భువనగిరి రమేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన బంగారు విజయ కుమార్ గత నెల 31న పదవీ విరమణ చేయడంతో ఆ స్థానంలో కట్టంగూర్ ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్ గా పనిచేస్తున్న రమేష్‌ను శాలిగౌరారం ఎంపీడీవోగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో కృషి చేస్తానని తెలిపారు.

భువనగిరి మహాసభను విజయవంతం చేయాలి

ఎమ్మార్పీఎస్ యాదాద్రి జిల్లా ఇంచార్జీ బిర్రు మహేందర్ మాదిగ

ఎంఎస్ఎఫ్ మోత్కూరు మండల నూతన కమిటీ ఎన్నిక



ప్రజావార్ధి/మోత్కూరు

ఈనెల 23న భువనగిరిలో నిర్వహించనున్న హలో మాదిగ చలో విద్యార్థి మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ యాదాద్రి జిల్లా ఇంచార్జీ బిర్రు మహేందర్ మాదిగ కోరారు. మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని ఆర్యవైశ్య భవన్‌లో శుక్రవారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గనపాక నవీన్ అధ్యక్షతన మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయం , సమానత్వం కోసం భవిష్యత్ ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలో ఏ ఉద్యమం జరిగినా, ఏ ఉద్యమం విజయం సాధించినా అందులో విద్యార్థుల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. దేశంలో ఏండ్ల తరబడి సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలు తీవ్రంగా కొనసాగుతున్నాయని, వాటిపై పోరాడి మార్చాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థి పోరాటాలను బలోపేతం చేసేందుకు గ్రామగ్రామాన ఎంఎస్ఎఫ్ కమిటీలు వేయాలని, విద్యార్థులతో సమావేశాలు నిర్వహించి త్వరగా కమిటీలను పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ఎంఎస్ఎఫ్ మోత్కూరు మండల కమిటీని ఎన్నుకున్నారు. ఎంఎస్ఎఫ్ మండల అధ్యక్షునిగా బత్తుల చరణ్ మాదిగ, అధికార ప్రతినిధిగా పందుల రిషిక్, ఉపాధ్యక్షుని గడ్డం అభిషేక్, ప్రధాన కార్యదర్శిగా శివ, కార్యదర్శిగా మనోహర్, సహాయ కార్యదర్శిగా బన్నీ ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ గణపాక నవీన్, పట్టణ అధ్యక్షుడు మేడి వినయ్, ఎమ్మార్పీఎస్ మండల సీరియల్ నాయకులు సుంకిశాల అనిల్, మేడి మహేష్, కూరెళ్ల నాగరాజు, చెడిపల్లి ఆదిత్య, వస్తుప్పల సాయి తదితరులు పాల్గొన్నారు.